ప్రజాశక్తి
శుక్రవారం 7 జులై 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

భూ సమగ్ర సర్వేకు ఆటంకాలు

వెంటాడుతున్న మిషన్ల కొరత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / ఆనందపురం

విశాఖ జిల్లాలో జరుగుతున్న భూ సమగ్ర సర్వే పలుచోట్ల ఆటంకాలు నడుమ మందకొడిగా సాగుతోంది. విశాఖలో పదుల సంఖ్యలో గ్రామాల్లో ఈ సమగ్ర సర్వే నిలిచిపోయింది. మూడు విడతల్లో భూముల సర్వే జరగాల్సి ఉండగా మిషన్లు లేకపోవడం ఒక సమస్యగా కనిపిస్తోంది. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కొన్నిచోట్ల మందకొడిగా నడుస్తోంది. ఆనందపురం మండలంలోని 26 గ్రామ పంచాయతీలు, 18 సచివాలయాల్లో సమగ్ర భూ సర్వే పనులు చేపట్టారు. దీనిలో భాగంగా 12 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని తహశీల్దారు రామారావు తెలిపారు. పూర్తయిన సచివాలయాల పరిధిలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. మిగిలిన పంచాయతీలలో సర్వే పూర్తికాకపోవడం వల్ల గ్రామ సచివాలయాల్లో పలు పనులు ప్రారంభం కాక రైతులు అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీలోనే రిజిస్ట్రేషన్ల కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం ఈ సర్వేలో జరుగుతోన్న ఆలస్యంతో అవస్థలు పడుతున్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

కుసులవాడలో సర్వే ఎందుకు ఆగింది ?

ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో జరగాల్సిన సమగ్ర భూ సర్వే వారం రోజులుగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. ప్రారంభమే తరువాయి సర్వే నిలిచిపోవడానికి భూవివాదాలు కూడా కారణంగా ఉన్నాయని తెలుస్తోంది.

ఈ పంచాయతీలో 42 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేసి కొంత మేర ముందుకెళ్లింది. అక్కడ కొంతమంది రైతులు ల్యాండ్ పూలింగ్‌కి వ్యతిరేకంగా ఉన్నారు. సమగ్ర భూ సర్వేకు కూడా ఈ కారణం వల్లనే అడ్డుతగలడంతో ఆగిందన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు కూడా ఇక్కడ సర్వేను అర్ధాంతరంగా నిలిపివేసినట్లు వెల్లడించారు.

ఆనందపురం తహశీల్దార్ ఏమన్నారంటే..

స్థానిక తహశీల్దార్ రామారావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కుసులవాడ, ఆనందపురంలో సమగ్ర భూ సర్వే నిలిపివేతకు భూ సమస్యలు కారణం కాదని, మ్యాప్‌లు, సామగ్రి సమకూరినప్పటికీ మిషన్ల కొరత కారణంగానే సర్వేను వాయిదా వేశామని తెలిపారు. మరో ఐదు రోజుల్లో సర్వే చేపడతామని వెల్లడించారు.

ఉక్కు రక్షణకు..

నేడు సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల దీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే క్రమంలో సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి విశాఖ నగరంలో '24 గంటల నిరాహార దీక్ష' చేపట్టనున్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్, ముడి సరుకు, రైల్వే రేక్స్ సాధన కోసం జరిగే ఈ దీక్షలో సిపిఎం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు కూర్చుంటారని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. దీక్షను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని వెల్లడించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ దీక్ష 8వ తేదీ ఉదయం 10 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాల కోసం జరిగే ఈ దీక్షలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని, కార్మిక, ప్రజా సంఘాలు, వివిధ తరగతుల అసోసియేషన్ల నాయకులు, మేధావులు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

మేయర్ల సదస్సుకు హరి వెంకటకుమారి పయనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి - 20 సదస్సులో భాగంగా అహ్మదాబాద్‌లో ఈ నెల 6 నుంచి మూడు రోజులుపాటు జరిగే మేయర్ల సదస్సుకు విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి గురువారం బయలుదేరారు. తొలి రోజు స్వాగత సదస్సు, వివిధ కార్యక్రమాలుంటాయని, జాతీయ, అంతర్జాతీయ దేశాలకు చెందిన పలువురు మేయర్లు పాల్గొంటారని మేయర్ కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. రెండో రోజు 7న శుక్రవారం పర్యావరణ పరిరక్షణకు తాము చేపడుతున్న వివిధ కార్యక్రమాలను డెలిగేట్స్ వివరిస్తారని పేర్కొన్నారు. అర్బన్ డెవలెప్‌మెంట్ పరిధిలో మహిళలు, యువత, పిల్లల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు సిటీ టూర్ ఉంటుందన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలూ ఉంటాయన్నారు. 8న శనివారం యు-20 ట్రీ ప్లాంటేషన్, రౌండ్ టేబుల్ సమావేశాలు జరుగుతాయన్నారు. అందువల్ల ఈ నెల 9 వరకు ఆమె విశాఖలో అందుబాటులో ఉండరన్నారు.



హరి వెంకట కుమారి

సాహితి ఫార్మా పేలుడు క్షతగాత్రుల్లో.. మరో ఇద్దరు మృతి

▶ వార్త మెయిన్‌లో..

2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలి

▶ వార్త 2లో..

కార్మికుల భద్రతకు పటిష్ట రక్షణ చర్యలు

▶ వార్త 6లో..



ఎయు గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎవికె కాలేజీ మూసివేతపై ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాజువాకలోని ఎవికె న్యూస్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం అర్ధాంతరంగా కాలేజీని మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రా యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ ఎవికె న్యూస్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం కాలేజీలో చదువుతున్న 400 మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందన్నారు. లాభాలు రావడం లేదని, మిగతా 2లో..

టిడిపి సీనియర్ నేత లాలం భాస్కరరావు మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, రాంబిల్లి, అచ్యుతాపురం విలేకరులు

టిడిపి సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి లాలం భాస్కరరావు (70) గురువారం గుండె జబ్బుతో విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. యలమంచిలి నియోజవర్గం రాంబిల్లి మండలం లాలంకోడూరుకు చెందిన భాస్కరరావు టిడిపి తరపున రాంబిల్లి ఎంపిపిగా, జెడ్‌పిటిసిగా పనిచేశారు. యలమంచిలి నియోజవర్గ ఇన్‌ఛార్జిగానూ వ్యవహరించారు. 2009లో యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన భార్య లాలం భవాని విశాఖపట్నం జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్‌గా ఐదేళ్లపాటు పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భాస్కరరావు పార్థివదేహాన్ని టిడిపి విశాఖ జిల్లా కార్యాలయానికి తీసుకురాగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు.

లాలం కోడూరులో విషాదఛాయలు

భాస్కరరావు మృతితో స్వగ్రామమైన లాలంకోడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. భాస్కర రావు మరణవార్త తెలుసుకున్న వెంటనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, భీమిలి, విశాఖ ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, తదితరులు లాలం కోడూరు తరలివచ్చి భాస్కరరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. భాస్కరరావు అంత్యక్రియలను శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



నివాళ్లర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్



భాస్కరరావు (ఫైల్‌ఫొటో)

మొదటి పేజీ తరువాయి..

ఎవికె కాలేజీ మూసివేతపై ధర్నా

వేరే వ్యాపారాలు తమకు ఉన్నాయని చెబుతూ కాలేజీ మూసివేతకు తెగబడటం దారుణమన్నారు. ఇష్టానుసారం ఫీజులు వసూలు చేసుకుని, సెమిస్టర్ పరీక్షలు దగ్గరవుతున్న తరుణంలో విద్యార్థులకు క్లాసులు నిర్వహించకుండా, ల్యాబ్ వర్క్ జరపకుండా నెలల తరబడి నెట్టుకొచ్చి నేడు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడంపై మండిపడ్డారు. విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకూ కాలేజీని నిర్వహించాలన్నారు. అనంతరం ఎయు సిడిసి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గర్ల్స్ కన్వీనర్ జి.పల్లవి, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.శశికుమార్, నాయకులు సాయి తేజ, ఎం. తేజ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎ ఇంటర్ ఫలితాల్లో సిపిఇ సిఎ అకాడమీ ప్రతిభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఐసిఎఐ బుధవారం విడుదల చేసిన సిఎ ఇంటర్ ఫలితాలలో సిపిఇ సిఎ అకాడమీ ఆల్ ఇండియా స్థాయిలో 36వ ర్యాంకు సాధించిందని అకాడమీ సిఇఒ బి.ఆదినారాయణ తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అకాడమీలో ఇంటర్మీడియట్ ఎంఇసితో పాటు సిఎ చదువుతున్న ఎస్.మణి సహారా 610 మార్కులతో ఆల్ ఇండియా 36వ ర్యాంకు సాధించడం తమ అకాడమీకి గర్వకారణమన్నారు. ప్రణాళికాబద్ధమైన బోధన, రెగ్యులర్ పరీక్షల నిర్వహణనే ఉత్తమ ఫలితాలకు కారణమన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులు చేస్తున్న తప్పులను సరిదిద్దుతూ, వారి సందేహాలను నివృత్తి చేసి వారిని ప్రోత్సహించడం వల్ల మంచి ర్యాంకులు దక్కాయన్నారు. 36వ ర్యాంక్ సాధించిన విద్యార్థి మణి సహారా మాట్లాడుతూ తాను చదువుకున్న సంస్థలో విద్యాబోధన అన్ని విధాలా బాగున్నందునే తాను విజయం సాధించానని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పిఎన్‌వి.ప్రసాద్, డైరెక్టర్లు సుధీర్, రామచంద్రం పాల్గొన్నారు.

23న ఉత్తమ విద్యార్థుల అభినందన సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యా రంగంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచి అధికంగా మార్కులు సాధించిన గవర విద్యార్థులకు ఈ నెల 23న కంచరపాలెం రైల్వే ఆశీర్వాద కల్యాణ మండపంలో 'ఉత్తమ విద్యార్థినీ, విద్యార్థుల అభినందన సభ - 2023' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ తెలిపారు. గురువారం కేంద్ర గౌరీ సేవా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర విద్యార్థులను విద్యలో ప్రోత్సహించే నిమిత్తం వారికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి సత్కరించనున్నట్టు తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో చదువుకున్న 10వ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ అన్ని గ్రూపుల వారికి, పాలిటెక్నిక్ - 2023 ఎంట్రన్స్, ఎపి సెట్-2023 ఇంజినీరింగ్ మెడికల్, ఐఐటి - 2023, గేట్-2023, ఐసిఇటి, ఇసిఇటి, ఎఐఇఇఇ, ఎయు సెట్, లా సెట్, ఎపి ఆర్‌జెసి, పిజి సెట్, పిహెచ్‌డి, నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ వచ్చిన వారికి ఈ పథకంలో అర్హత కల్పించినట్లు తెలిపారు. గవర విద్యార్థులు అవార్డు కోసం ఈ నెల 15లోగా వారి దరఖాస్తులను విశాఖ రైల్వే న్యూ కాలనీ, తాటి చెట్లపాలెం కేంద్ర గౌరీ గవర సేవా సంఘం కార్యాలయంలో అందించాలని కోరారు. గౌరీ సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పెంటకోట సంజీవరావు నాయుడు, మల్ల శంకరరావు, పీలా ప్రసాద్, శరగడం సత్యనారాయణ, వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వారిని అభినందిస్తున్న వీ డెంటల్ ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే న్యూ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురువారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఆలయానికి విచ్చేసిన భక్తులు, స్థానికులకు బిపి, సుగర్, దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అనారోగ్యంతో భాద పడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఉదయం 8 గంటల నుండి 12.30 వరకు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో వీ డెంటల్ హాస్పిటల్, పినాకిల్ హాస్పిటల్ వైద్య బృందాలు వైద్య సేవలు అందించాయి. ఈ సందర్భంగా వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మాట్లాడుతూ దంత సమస్యలు చిన్నగా ఉన్నప్పుడే తగిన చికిత్స చేయించుకోవాలని అన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల పంటి సమస్యలు తలెత్తుతాయని స్పష్టం చేశారు. నోటి శుభ్రత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి బెస్ట్ ఓరల్ హైజీన్ అవార్డులను ఆలయ కమిటీ చైర్మన్ కె.శేషగిరిరావు అందజేశారు. డెంటల్ సర్జన్ ఫరూఖ్, హరిబాబు, పినాకిల్ హాస్పిటల్ ప్రతినిధులు సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 875వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఒసిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్, సీనియర్ నాయకులు ఎన్.రామారావు, టివికె.రాజు మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన కేంద్ర ప్రభుత్వమే విశాఖ ఉక్కు వంటి భారీ పరిశ్రమను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన పరిశ్రమను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూడటం ప్రజా ద్రోహం అవుతుందన్నారు. విశాఖ నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిఐటియు నాయకులు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 826వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్, కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ పర్నేస్‌లను మూసివేయడం దారుణమన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తికి దోహదపడే వాటిని ఒక్కొక్కటిగా మూసివేస్తూ ప్లాంట్‌కు నష్టాలు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. దీక్షల్లో సంఘం కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు, నాయకులు రామ్ గోపాల్, మద్దిలపాలెం జోన్ నాయకులు చలపతి, ఎ.సింహాచలం, వి.తులసీరాం, కె.కుమారి, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెం వద్ద దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో 2017 జనవరి 1 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఈ సంస్థలోని పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఎఐబిడిపిఎ, ఎస్ఎన్‌పిడబ్ల్యుఎ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కె.రామమోహనరావు, వరప్రసాద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాయింట్ ఫోరం బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. 2017 జనవరి 1 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలన్నారు. ఎగ్గొట్టిన కరువు భత్యం ఇవ్వాలన్నారు. 65, 70, 75, 80 సంవత్సరాలకు వరుసగా 5 శాతం, 10 శాతం, 15 శాతం, 20శాతం క్వారంటమ్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 31న జిల్లాస్థాయిలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే ఆగస్టు 21 నుంచి 25 వరకు ఢిల్లీలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. గోవిందరాజు, ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త పన్ను రద్దుచేయాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

చెత్తపన్ను, పెంచిన విద్యుత్‌ ఛార్జీలు, స్మార్ట్‌ మీటర్లు రద్దుచేయాలని డిమాండ్‌ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పలు సచివాలయాల వద్ద గురువారమూ నిరసనలు కొనసాగాయి.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి 67వ సచివాలయం వద్ద సిపిఎం మధురవాడ జోన్‌ కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మధురవాడ జోన్‌ కమిటీ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ఆపేస్తామని లబ్ధిదారులను, టార్గెట్‌ ప్రకారం వసూళ్లు చేయలేదని సచివాలయ సిబ్బందిని వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.కొండమ్మ, కె.సుజాత, డి.తులసి, ఎం.కనకరత్నం, కె.పుష్ప, ఎం.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : మాధవధార సచివాలయం వద్ద సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అడ్మిన్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సనపల రామ్‌గోపాలరావు, అమలమ్మ, జనార్ధనమ్మ, అనురాధ, పార్వతి, శ్రీదేవి, లలిత, జిఎన్‌.మూర్తి, గోపాలకృష్ణ, రామారావు, రాజశేఖర్‌, శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : సిపిఎం ఆరిలోవ జోన్‌ కమిటీ ఆధ్వర్యాన 12, 13 వార్డుల సచివాలయాల వద్ద నిరసన తెలిపారు. సిపిఎం, ఐద్వా నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని పెంచిన విద్యుత్‌ చార్జీలను రద్దు చేయాలని, చెత్తపై యూజర్‌ చార్జీలు రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, బి.సూర్యమణి, ఎస్‌.రంగమ్మ, కాంత, ఎర్రయ్యమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ఆరిలోవ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఉక్కునగరం : కూర్మన్నపాలెం సమీపంలోని పకీర్‌తకియా, 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసరాజు, వివి రమణ, ఎన్‌.రామారావు, జి.గంగాధర్‌, దత్తాత్రేయ, విడివి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : 94వ వార్డు పరిధి సప్ప అప్పలనరసయ్య కాలనీ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిరుపతిరావు, అప్పలనాయుడు, సిపిఎం జోన్‌ కార్యదర్శి బి.రమణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానికంగా వంట గ్యాస్‌ స్టౌలు మరమ్మతు చేసుకుంటున్న 25 ఏళ్ల యువకుడు ఎస్‌ శ్యామ్యూల్‌ ఈ నెల 2 వ తేదీ నుంచి కనిపించడంలేదని అతని భార్య భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమిలి ఎస్‌ఐ జి.హరీష్‌ కథనం ప్రకారం.. శ్యామ్యూల్‌కు వివాహమైంది. నలుగురు పిల్లలు ఉన్నారు. వంట గ్యాస్‌ స్టౌలు బాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితున్ని కలిసి వస్తానని భార్యకు చెప్పి శామ్యూల్‌ ఈ నెల 2వ తేదీన సాయంత్రం 5 గంటలకు హోండా బైక్‌పై బయలుదేరాడు. తర్వాత ఇంటికి చేరలేదు. స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరీష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9182694835కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -గాజువాక : కృష్ణానగర్‌ జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. శ్రీనగర్‌కి చెందిన బి.మహేష్‌ (30) స్వతంత్ర నగర్‌ నుంచి శ్రీనగర్‌ వెళ్తుండగా కృష్ణానగర్‌ వద్ద లారీ ఢీకొట్టింది. దీంతో మహేష్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. యువకుని తండ్రి ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌ 30న వడ్డాది వైపు నుండి వస్తున్న వ్యానును ముందస్తు సమాచారంతో బుచ్చయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి తన సిబ్బందితో విజయరామరాజుపేట వద్ద తనిఖీ చేశారు. వ్యాన్‌ బాడీలో అదనపు అరలు అమర్చి 77 ప్యాకెట్లు గల 308 కిలోల గంజాయి ఉండడంతో డ్రైవర్‌ పంతల భగవాన్‌ను అరెస్టు చేసి విచారించారు. డ్రైవర్‌ చెప్పిన వివరాల ప్రకారం పెదబయలు మండలం కారుకొండ గ్రామానికి చెందిన సోకలి లక్ష్మణరావు, అతని కొడుకు చక్రి, ఒడిశాకు చెందిన నిరికి రఘునాథ్‌తో కలిసి ఏజెన్సీలో గంజాయి కొని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపాడు. బుచ్చయ్యపేట ఎస్సై కుమార స్వామి కేసు దర్యాప్తు వేగవంతం చేసి కేసులో ముద్దాయిలు సోకలి లక్ష్మణరావును ముంచింగిపుట్టు మండలం జోలపుట్లో, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌ జిల్లా సురిమి గ్రామంలో నిరికి రఘునాథులను ఈనెల ఐదున అరెస్టు చేసినట్లు తెలిపారు. త్వరితన కేసును ఛేదించిన బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామిని, కానిస్టేబుల్‌ కేఎస్‌ఎస్‌ గణేష్‌, ఓ.కిరణ్‌, ఎం వెంకటేశ్వరరావు, హెడ్‌ కానిస్టేబుల్‌ అర్జునను అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు రెండు బొలేరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్‌ బియ్యాన్ని గురువారం ఉదయం అధికారులు పట్టుకున్నారు. దేవరాపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు పిడిఎఫ్‌ బియ్యం అక్రమంగా తరలిస్తూ విక్రయిస్తున్నారని విజిలెన్స్‌ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌ తిరుపతిరావు, ఎస్సై రవికుమార్‌తో కూడిన బృందం బుధవారం రాత్రి 11 గంటల సమయంలో దేవరాపల్లి చేరుకొని బియ్యం బస్తాలు వ్యాన్లో లోడ్‌ చేస్తున్న ప్రాంతంలో కాపు కాశారు. ఒక వ్యాను పెట్రోల్‌ బంక్‌ దాటిన తర్వాత పట్టుకోగా, మరో వ్యాను సంజీవపురం ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ రెండు వ్యానులను దేవరాపల్లి పోలీస్‌ స్టేషన్‌కి తీసుకువచ్చి సీజ్‌ చేశారు. పట్టుబడిన బియ్యాన్ని దేవరాపల్లి నిత్యావసర సరుకుల గిడ్డంగికి అప్పగించారు. రెండు వాహనాల యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుపతిరావు తెలిపారు.

ఎన్‌టిపిసి పర్యావరణంపై దృష్టిపెట్టేలా చూడాలి

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఎన్‌టిపిసికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పర్యావరణ ప్రభావంపై నేషనల్‌ ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీరింగ్‌ రీసెర్చ్‌ (నీరి) అధ్యయన నివేదికలు అమలయ్యేలా పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలికి చెన్నయ్‌లోని నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌ సూచించింది. పరవాడలోని ఎన్‌టిపిసి పర్యావరణ సమస్యలపై వేసిన పిటిషన్‌పై ఎన్‌జిటి బుధవారం తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్‌టిపిసి పరిసరాల్లో పర్యావరణ సమస్యలు పెరగకుండా, గాలి, నీరు, భూమి కాలుష్య తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

పేదలకు ఆహార పొట్లాలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌గా, ఎఎంసి చైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా ఎన్నో పదవులు అలంకరించిన కీర్తిశేషులు మొకర నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె, జివిఎంసి ఒకటో వార్డు సంతపేట డాక్టర్‌ బి ఆర్‌ అంబేద్కర్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి ఆధ్వర్యాన శుక్రవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన భీమిలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్‌ గంటా అప్పలకొండ, నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్‌, ఎస్‌.జోగారావు, జి.పోలిరాజు, కెఎస్‌ఆర్‌.కృష్ణారావు, సత్తరవు చిన్న తదితరులు పాల్గొన్నారు. నాగవంశ సంక్షేమ సంఘం ప్రతినిధులు గాడు సన్యాసినాయుడు, కె.ముత్యాలరావు, కనకల అప్పలనాయుడు నివాళులర్పించారు.

బోనిలో పొలంబడి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామంలో జీపిపి ఉత్తమ యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ అధికారి సంధ్యారత్నప్రభ ఆధ్వర్యాన రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఒక కిలో వరి విత్తనాలకు 8 గ్రాములు సుడోమోనాస్ని కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల వరి పంటపై వచ్చే అగ్గితెగులును నివారించవచ్చన్నారు.

5వ వార్డు అభివృద్ధికి సహకరించండి : మొల్లి హేమలత

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధిలో తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీలు, యుజిడి, చెరువులు, శ్మశానవాటికల ఆధునికీకరణకు సహకరించాలని, వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ సిఎం.సాయికాంత్‌వర్మకు కార్పొరేటర్‌ మొల్లి హేమలత గురువారం వినతిపత్రం అందించారు. వార్డులోని బొట్లవానిపాలెం, వెంపలచెరువు, నగరంపాలెం రాళ్లచెరువు అన్యాక్రాంతం కాకుండా వెంటనే ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని, స్వతంత్రనగర్‌, రాజీవ్‌గృహకల్ప, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం, పిపి-1 కాలనీలలో గల పార్కులు, ప్రహరీ, శారదనగర్‌ కాలనీలో తాగునీరు పైప్‌ లైన్‌, పాత పైపులైన్‌ స్థానంలో కొత్త పైపులైన్‌ వెయ్యాలని, అంబేద్కర్‌ కాలనీలో సామాజిక భవనం, రోడ్లు, కాలువలు, సాయిరాం కాలనీలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన కల్యాణ మండపాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, బొట్లవానిపాలెంలో సామాజిక భవనం నిర్మాణ పనులు ప్రారంభించాలని, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం, పి.పి-1కాలనీలలో వార్డు సచివాలయాలు నిర్మించాలని, చాలాచోట్ల వీధిలైట్లు లేవని, ఏర్పాటుచేయాలని వినతిలో పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని రైతు సాధికార సంస్థ రీజినల్‌ ఆఫీసర్‌ హేమసుందర్‌ తెలిపారు. ఆనందపురం మండలం తర్లువాడ యూనిట్‌ పాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలు, పలు రకాల పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, జీవామృతం పాటించడం వల్ల పంట ఆరోగ్యంగా పెరిగి, నేల సారవంతంగా మారుతుందన్నారు. ఈ విధంగా పండించిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ గ్రామంలో 10 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా 17 మంది రైతులు కూరగాయలు పండిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి మోహనరావు, ఎన్‌ఎఫ్‌ఎలు అనురాధ, వనజ, మండల యాంకర్‌ రామారావు, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు

దంత కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్‌ నీరుకొండ దంత వైద్య కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో ముంబైకి చెందిన బికెఎస్‌ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలకు హాజరైన 48 మంది విద్యార్థులకు 26 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎల్‌.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అనిల్‌ నీరుకొండ ఎడ్యుకేషనల్‌ సొసైటీ సిఇఒ నిరంజన్‌ కుమార్‌ కళాశాలలో అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో సిఇఒ నిరంజన్‌కుమార్‌ తదితరులు

నేటి నుంచి బాక్సింగ్‌ పోటీలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 10వ వైఎస్‌ఆర్‌ కప్‌-2023 జిల్లా స్థాయి బాక్సింగ్‌ పోటీలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు మారుతి బాక్సింగ్‌ క్లబ్‌ అధ్యక్షుడు మారుతి ప్రసాద్‌ తెలిపారు. పాఠశాల వద్ద గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధురవాడలో పదేళ్లుగా తమ క్లబ్‌ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షులు దల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్‌ చైర్మన్‌ పిల్లా సుజాతసత్యనారాయణ, తైక్వాండో కోచ్‌ బి.ఆనందరావు, బాక్సింగ్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు దండు నాగేశ్వరరావు, కె.నూకరాజు, జిల్లా బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ సెక్రటరీ భూషణరావు, వైసిపి నాయకులు పోతిన శ్రీనివాసరావు, అల్లాడ వెంకట్రావు, బంగారు ప్రకాష్‌, పసుపులేటి గోపి, బైపిల్లి ప్రసాద్‌, జగుపల్లి నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి గోపీబాబు సస్పెన్షన్‌

ప్రజాశక్తి -పద్మనాభం : మండలానికి చెందిన దంతులూరి గోపాలకృష్ణమూర్తిరాజు (గోపీబాబు)ను వైసిపి నుంచి సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నాలుగేళ్లుగా వైసిపి కార్యక్రమాలకు దూరంగా ఉండటమే కాకుండా పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ పలు వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్నట్లు గమనించి జిల్లా పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు సస్పెండ్‌ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేసి సభ్యుల అనుమతితో సస్పెండ్‌ చేసినట్లు వెల్లడించారు.ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు పాల్గొన్నారు.



26వ వార్డులో స్థానికుల సమస్యలనడిగి తెలుసుకుంటున్న కెకె.రాజు

26వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి లలితానగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కెకె.రాజు నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఎలా వెంకటలక్ష్మి, జోనల్ కమిషనర్ వై.విజయలక్ష్మి, 42వ వార్డు కార్పొరేటర్ లీలావతి(శ్రీనివాసరావు, పాండవ శ్రీనివాసరావు, సమ్మెట్ల వెంకటేష్, గోవిందు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీలో నీట్ ఓపెన్ కేటగిరీ కోటా క్లోజ్ చెయ్యాలి

ప్రజాశక్తి-మాధవధార : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎంబిబిఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు చెందేలా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగ ఛైర్మన్ మూల వెంకట్రావు కోరారు. ఆంధ్ర యూనివర్సిటీ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని ఎంబిబిఎస్‌తో పాటు పీజీ సీట్లు కూడా పూర్తిగా రాష్ట్ర విద్యార్థులకే చెందేలా చేయాలన్నారు. ముందుగా న్యాయపరమైన సలహా తీసుకొని ఓపెన్ కోటా ఆంధ్రాలో క్లోజ్ చేయాలని కోరారు. మన రాష్ట్రానికి చెందిన కొన్ని బీసీ కులాలను నాన్ లోకల్‌గా పెట్టారని, వారికి తెలంగాణ ప్రభుత్వం అడ్మిషన్ ఇస్తే చాలామందికి ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

కల్పతరు ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : సెంటర్ ఫర్ ఎంటర్ పెన్యూర్ షిప్ ఆన్ ఇండస్ట్రీ 4.0 కల్పతరు కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌బట్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలకు సాంకేతికంగా మద్దతు ఇచ్చేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాబోయే దశాబ్దంలో భారతదేశం గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు ద్వారా భారీ పెట్టుబడులు పెడుతూ ఉక్కు సామర్థ్యాన్ని మరో 150 మిలియన్ టన్నులకు పెంచుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైజాగ్ ఇండస్ట్రీ 4.0 స్టార్టప్ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వైజాగ్ ఎకానమీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రభుత్వ పరిధిలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఇంక్యుబేషన్ సెంటర్ రోబోటిక్స్, డ్రోన్, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి ప్రయోగశాలలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కల్పతరు పర్యావరణ వ్యవస్థను ఉపయోగించి విశాఖ చుట్టుపక్కల ఉన్న ఇతర పరిశ్రమల పారిశ్రామిక సమస్యలకు, ఉత్పత్తులకు పరిష్కారాలను కనుగొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, సివిడి రాంప్రసాద్, స్టీల్‌ప్లాంట్ జిఎం డాక్టర్ బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి వివేకానంద కల్యాణ మండపంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాడి కేశవరెడ్డి, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ త్రినాధరావు, డిఇ శ్రీనివాస్, ఎఇ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. జివిఎంసి 44వ వార్డు పరిధి షాదీఖానా కల్యాణ మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు కెకె.రాజు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి, ఎఇ రమణమ్మ, విఆర్‌ఒ నాగేశ్వరరావు, వార్డు నాయకులు హబీబ్, సీతారాం, హీర, పి.గోపి, హరిపట్నాయక్, మహాదాస్య గోపి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి 2వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పలువురికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ పరిశీలకులు, మాజీ మంత్రి పి బాలరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాముునాయుడు, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైసిపి రెండో వార్డు ఇంఛార్జి ఎస్ సరళా రాణి, తదితరులు పాల్గొన్నారు.

'గంగవరం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే నాగిరెడ్డి



నిరవధిక దీక్షలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. గంగవరం పోర్టు మొండివైఖరికి నిరసనగా కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష గురువారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలనుద్దేశించి ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అదాని గంగవరం పోర్టు యాజమాన్యం సామరస్యంగా పరిష్కరించాలన్నారు. రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి సమక్షంలో సర్క్యూట్ హౌస్‌లో జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేస్తానని చెప్పారు.

టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సముద్రాన్ని సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ యాజమాన్యం దోచుకుంటుందని విమర్శించారు. 29 మంది కార్మికులను విధుల్లోకి తీసుకుంటేనే చర్చలకు వెళ్లాలని సూచించారు. నిర్వాసిత కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, బేసిక్‌లో డిఎ మెర్జ్ చేసి కొత్త బేసిక్ రూ.22 వేలుగా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఉద్యమం కొనసాగించాలన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, యాజమాన్యం కార్మికులను మాత్రమే సంప్రదింపులకు పిలుస్తోందని, అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు లేకుండా వెళ్లేది లేదని చెప్పారు. శిబిరం నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు, విశాఖ పోర్టు యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు నిర్వాసిత కార్మికుల ఉద్యమానికి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కారి దానయ్య, కారి గోపి, పల్లెటి పోలయ్య, దవులుపిల్లి ఎల్లాజీ, వాసుపల్లి యల్లాజీ, మాద అప్పారావు, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి సత్యానందం, పేర్ల సూకరాజు, నోళ్ల స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం వెంటనే చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అదానీ గంగవరం పోర్టులో తక్షణమే వేతన ఒప్పందం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణంలో నిర్వాసితులు తమ ఇళ్లను, భూములను త్యాగం చేశారని, వారికి పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు ఇస్తానని చెప్పి నేడు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ వద్ద ఈ మధ్య కాలంలో రెండుసార్లు చర్చలు జరిగాయని, కలెక్టర్ చేసిన సూచనలను కూడా అమలు చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. గంగవరం పోర్టు పోలీసుల పరిపాలనలో నడుస్తోందని, అక్కడ అధికారులందరినీ మాజీ పోలీసాధికారులతో నింపారని తెలిపారు. దీంతో వారి పెత్తనం, బెదిరింపులు పెరుగుతున్నాయని అన్నారు. సంవత్సరాలుగా పనిచేస్తున్నా గంగవరం పోర్టులో కార్మికుల బేసిక్‌లో ఎలాంటి మార్పు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇంక్రిమెంట్లు కూడా ధరల పెరుగుదలకు అనుగుణంగా ఉండటం లేదన్నారు. విశాఖ పోర్టు, స్టీల్‌ప్లాంట్లో పర్మినెంటు కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో సగం కూడా గంగవరం పోర్టు జిపిఎల్, జిపిఎస్ కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నించినా, మాట్లాడినా వారిపై కక్షపూరిత చర్యలకు దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం 24 కాలనీలో విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన కార్యకర్త పీతల రమణ(32)కు జనసేన నాయకులు కుప్పా రామలక్ష్మి ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు, రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుక్క వెంకటరావు, తమ్మిన అప్పలరాజు, తాడివాడ శివకృష్ణ, మీసాల నాగేశ్వరరావు, కొట్నాడు కిరణ్, బొద్దపు గోవింద్, తాడివాడ ప్రశాంత్, రౌతు నాగరాజు, ముడసల శ్రీను, ఇమంది శ్రీనివాసరావు, కార్తిక్ అప్పారావు, గణేష్, రాజు, బాలు, లోకేష్, రాము, శ్రీను పాల్గొన్నారు

చెత్త సేకరించకుంటే తీవ్ర పరిణామాలు



గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తోకాడ అపార్ట్‌మెంట్ల వాసులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి ఆధ్వర్యాన తక్షణమే చెత్త సేకరణ చేపట్టాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు హెచ్చరించారు. చెత్త పన్ను చెల్లించాలని జివిఎంసి గాజువాక జోన్ అధికారుల బెదిరింపులకు నిరసనగా తోకాడలోని సమైక్య, సిరి, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ల ప్రజలు గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు గంగారావు హాజరై మాట్లాడారు. చెత్తను తరలించకుండా ఉంచడం చట్ట వ్యతిరేకమన్నారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న చెత్తను తీసుకెళ్లకపోతే జివిఎంసి కార్యాలయం వద్ద, వార్డు కార్పొరేటర్ ఇంటి ముందు చెత్తను వేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఈ చెత్త సమస్యపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు పథకాలను నిలుపుదల చేస్తామని భయభ్రాంతులకు గురిచేసి చెత్త పన్ను వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారులు ఎంత బెదిరించినప్పటికీ 30 శాతం ప్రజలు మాత్రమే చెల్లించారని తెలిపారు. దీన్నిబట్టి చూస్తే చెత్త పన్నుపై ప్రజల్లో ఎంతటి వ్యతిరేకత ఉందో తెలుస్తోందన్నారు. చెత్త పన్ను వసూలు చట్టంలో ఎక్కడా లేదని తెలిపారు. చెత్తపన్ను పేరుతో బెదిరింపులకు పాల్పడితే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన చెత్త వాహనాలకు నెలకు రూ.65 వేలు చెల్లించాలని, వాటి నిర్వహణను జగన్మోహన్‌రెడ్డి అనుచరులకు కట్టబెట్టారని, వసూలు చేసిన చెత్త పన్ను ఆయనకి చెల్లిస్తున్నారని తెలిపారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టు నుంచి ట్యాక్స్ వసూలు చేయకుండా వారికి రాయితీలిచ్చి ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తమ అపార్ట్‌మెంట్ నుంచి రూ.6 లక్షల పన్ను చెల్లిస్తున్నామని, ఇది చాలదని చెత్త పన్ను కూడా కట్టాలని జోనల్ కమిషనర్ స్థాయి అధికారి అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి వీధి రౌడీలా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. చెత్తను రోజూ తీసుకువెళ్లే విధంగా చూడాలని కోరారు. గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ ప్రతినిధులు నారాయణ రావు, బి.దేవ్ మాట్లాడుతూ, చెత్త పన్నుపై కేసు కోర్టు పరిధిలో ఉన్నందున అంతవరకు చెల్లించబోమని స్పష్టంచేశారు. సిరి అపార్ట్‌మెంట్ ప్రతినిధి వాసు మాట్లాడుతూ, చెత్త పన్నుపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాలో వార్డు నివాస్ నాయకులు త్రినాథ్‌స్వామి, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ నాయకులు తవిటయ్య, తౌడన్న, రమణ, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెత్త పన్ను రద్దు చేయాలని నినదించారు. అనంతరం ఎఎంహెచ్ఒ డాక్టర్ కిరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన ఎఎంహెచ్ఒ చెత్తను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల

24 గంటల దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



ఎ.కోడూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే కార్యాచరణలో భాగంగా సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు ఈ నెల 7న విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పలు చోట్ల ఆవిష్కరించారు.

అనకాపల్లి : విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత అని సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, గంట శ్రీరామ్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు రక్షణకై ఉత్తరాంధ్ర సిపిఎం జిల్లా కార్యదర్శులు ఈనెల 7న ఉదయం 10 గంటల నుంచి, 8వ తేదీ ఉదయం 10 గంటల వరకు జరుగు 24 గంటల దీక్షకు సంబంధించిన పోస్టర్లను గురువారం వారు స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని. సొంతగనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 24 గంటల దీక్షలో ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కె.కోటపాడు : 24 గంటల దీక్ష వాల్ పోస్టర్లను గురువారం సిపిఎం నాయకులు మండలంలోని ఎ.కోడూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గండి నాయన బాబు మాట్లాడుతూ 8500 మంది స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు స్టీల్‌ప్లాంట్ విషయమై చిత్తశుద్ధతో కేంద్రంతో పోరాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో 24 గంటలు దీక్షలు గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటు వాళ్లకు అమ్మాలని కేంద్ర బిజెపి ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె నూకరత్నం, సిహెచ్ పవన్ కుమార్, చింతకాయల మాధవస్వామి, సిహెచ్ నూకన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : సిపిఎం కార్యదర్శుల దీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం స్థానిక కార్మికుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ తెలుగు ప్రజల కష్టాలను, కార్మికుల పోరాటానికి విలువ ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ స్థలాలను, భవనాలను ముక్కలు చేసి అమ్మదలిచిందని తెలిపారు. మరోప్రక్కన స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన గనుల లీజులు పునరుద్ధరించకుండా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కేసులకు భయపడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపితో చేతులు కలిపారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, అప్పారావు పాల్గొన్నారు.

తగరపువలస : 24గంటల దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, 8,500 మంది నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేయనున్నట్లు పార్టీ భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఈ



రాంబిల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

పేదల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదల క్షేమాన్ని కాంక్షించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. మండలంలోని గొలగాం గ్రామంలో గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. పథకాలు అందని వారు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడిన అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ గ్రామానికి చెందిన కోరుబిల్లి నాగరాజు, గొంతిన మోహన్ సాయిను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు అవసరమైన మొత్తాన్ని ప్రభుత్వం నుంచి అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ.10.30 లక్షలతో నిర్మించిన 20 కిలోలీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. రూ.6 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారావు, వైసిపి నాయకులు మంత్రి సత్తిబాబు, శంకరం వైసిపి నాయకులు పసుపులేటి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సరుగుడు నాట్లు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ముమ్మరంగా సరుగుడు నాట్లు వేస్తున్నారు. మండలంలోని వడ్డాది, బంగారుమెట్ట, కోమలపూడి, గున్నెంపూడి, పెదమదిన, రాజాం తదితర గ్రామాల్లో రైతులు సరుగుడు మొక్కల నాటే బిజీగా ఉన్నారు. పలువురు రైతులు స్థానికంగా దొరికే సరుగుడు నారును కొనుగోలు చేసి నాటుతున్నారు. కొంతమంది రైతులు క్రోన్ మొక్కలను కొనుగోలు చేసి నాటుతున్నారు.



సరుగుడు మొక్కలు నాటుతున్న రైతులు

ప్రజా సింహ గర్జనకు తరలిరండి

ప్రజాశక్తి- కశింకోట

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీల నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ ఈనెల 23న గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న చైతన్య వేదిక వద్ద తలపెట్టిన బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజా సింహగర్జనకు లక్షలాదిగా తరలిరావాలని రాష్ట్ర తెలుగు యాద మహాసభ అధ్యక్షులు కోన గురవయ్య యాదవ్ గురువారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు ఈ ప్రజా సింహగర్జన ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటల నుండి జరుగుతుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారమే ధ్యేయంగా పనిచేస్తున్న బోడె రామచంద్ర యాదవ్‌కు మద్ద తెలపాలని కోరారు.

అరకొరగా విత్తనాల సరఫరా

- ఆర్‌బికెల్లో గత నెలలోనే డబ్బులు చెల్లించిన రైతులు
- విత్తనాలు రాకపోవడంతో దిక్కుతోచని స్థితి

ప్రజాశక్తి-వడ్డాది

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్నట్లు ఉంది ప్రభుత్వం, వ్యవసాయాధికారుల పరిస్థితి. కాలం అనుకూలించి అడపాదడపా వర్షాలు పడుతున్నా వరినార్లు వేయడానికి అవసరమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదు. దీంతో విత్తనాల కోసం ఆర్‌బికెల్లో డబ్బులు చెల్లించిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

బుచ్చయ్యపేట మండలంలో 22 రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో విత్తనాల కోసం రైతులు గత నెలలోనే ఆయా కేంద్రాల్లో ఆధార్, 1బి, పాస్ పుస్తకం వంటివి సమర్పించి డబ్బులు చెల్లించి ఆన్‌లైన్ చేయించుకున్నారు. సీజన్ ప్రారంభం కావడానికి ముందే విత్తనాలు అందించాల్సి ఉంది. కాని సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ అరకొరగానే విత్తనాలు సరఫరా చేశారు. మండలంలోని లోపూడి రైతు భరోసా కేంద్రం నుండి 292 మంది రైతులు విత్తనాలకు ఆన్‌లైన్ చేయగా 192 మందికి మాత్రమే విత్తనాలు అందాయి. మిగిలిన 100 మంది రైతులకు విత్తనాలు అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలో వడ్డాది, కందిపూడి, పి.భీమవరం, పొట్టి దొరపాలెం తదితర రైతు భరోసా కేంద్రాల్లోనూ ఇదే సమస్య నెలకొంది.

వారం రోజుల క్రితం వరకు ఎండలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ వారంలో అడపాదడపా వర్షాలు పడటంతో వరి నార్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. అయితే వాతావరణం అనుకూలించినా వ్యవసాయ అధికారులు స్పందించకపోవడంతో విత్తనాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుగా డబ్బులు చెల్లించి ఆన్‌లైన్ చేయడంతో విత్తనాలు సమయానికి వస్తాయని ధీమాతో ఉన్న రైతులు సమయం మించిపోతున్నా రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బయట కొనుక్కోలేక రైతు భరోసా కేంద్రం నుంచి వచ్చే విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. చాలామంది రైతులు తమకు విత్తనాలు వద్దు డబ్బులు వెనక్కి ఇవ్వండి అని రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే రైతులు చెల్లించిన డబ్బులు ఆన్‌లైన్ పేమెంట్ అయిపోయిందని, మేము డబ్బులు తిరిగి ఇవ్వలేమని అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేతులెత్తేస్తున్నారు. సమయానికి విత్తనాలు ఇవ్వక.. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని, లేకుంటే డబ్బులు తిరిగి చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి



మాట్లాడుతున్న లోకనాథం

జిల్లాలో ఖరీఫ్‌కు సరిపడా వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు 23,387 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా 15,364 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే రావడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద విత్తనాలు అధిక ధరలకు కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తుండడంతో వరి విత్తనాల కోసం రైతులు ఆర్బీకేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. రైతులకు ప్రస్తుతం వున్న అవకాశాలు చేదాటిపోయిన తరువాత విత్తనాలు సరఫరా చేయినా ప్రయోజనం వుండదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వరి విత్తన అవసరాలను దృష్టిలో పెట్టుకొని జిల్లాకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. రైతుకు సరిపడా విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని, కౌలు రైతులకు కూడా విత్తన సమస్యలేకుండా రైతు భరోసా కేంద్రాల్లో ఇవ్వాలని లోకనాథం డిమాండ్ చేశారు.

లక్కబొమ్మల తయారీపై ప్రత్యేక శ్రద్ధ

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి - యలమంచిలి

విదేశాల్లో సైతం మంచి గుర్తింపు పొందిన అరుదైన కళ లక్క బొమ్మల తయారీ ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పేర్కొన్నారు. ఆమె గురువారం మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో హస్తకళల శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో హస్తకళాకారుల్ని కలిసి లక్కబొమ్మల తయారీలో ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ముడి సరుకు, విద్యుత్తు సబ్సిడీ, మార్కెట్ గురించి కళాకారులు వివరించారు. ప్రాచీన కళ అయిన లక్కబొమ్మల తయారీ వారసత్వంగా వస్తున్నప్పటికీ ఆధునిక పోకడలు కూడా అంది పుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. మరింత ఆధునికీకరణ, శిక్షణ కోసం రెండు లేతి మిషన్లు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, తహశీల్దార్ రాణిఅమ్మాజీ, ఎంపిడిఒ, జడ్‌పిటిసి సంధ్యారాము, ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణ, సిసి తల్లిబాబు, విఏఓలు పాల్గొన్నారు.



లక్కబొమ్మల కళాకారులతో మాట్లాడుతున్న జెసి జాహ్నవి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అనకాపల్లి డిఆర్ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2లక్షల 30వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్ మాటతప్పడం దారుణమన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన మాట అటకెక్కించారని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ గ్రూపు 1, 2, 4తో పాటు ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ కళాశాల అధ్యాపకులు, విశ్వవిద్యాలయ అధ్యాపకుల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వేముల కన్నబాబు, ఫణీంద్ర కుమార్, ఒమ్మి సతీష్, చిన్ని నాయుడు, కొండయ్య, అశోక్, వాసు, శ్రీను, కార్తీక్, లావణ్య, లక్ష్మి పూర్ణిమ, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలంటూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విశాఖ కలెక్టరేట్ ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎరిపల్లి రాంబాబు, అధ్యక్షులు కె.అచ్యుతరావు మాట్లాడారు.

జగనన్న సురక్షతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ధ్రువపత్రాలను అడిగిన వెంటనే పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నాయకులు సబ్బవరపు ముత్యాల నాయుడు, కోటాన రాము, వనం అచ్చునాయుడు, హేమంత్, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం పట్టణంలోని ఎడ్లవీధి సచివాలయం - 3 కాళ్ళ అప్పారావు కళ్యాణ మండపంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గాడి కాసులమ్మ, వైసిపి నియోజకవర్గ నాయకులు పప్పల జయదేవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వైవి సత్యారావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, సర్పంచ్ బండి నుకాలమ్మ, బండి శ్రీను, పల్లా నర్సింగరావు, మూడెడ్ల శంకర్రావు, ఒరుగంటి నెహ్రూబాబు, వివిఆర్ఓ సాయి పాల్గొన్నారు.



చోడవరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కార్మికుల భద్రతకు పటిష్ట రక్షణ చర్యలు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని అన్ని రకాల పరిశ్రమలలో కార్మికుల భద్రతకు సంబంధించిన ముందస్తు రక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కర్మాగారాలలో కార్మికుల భద్రతకు సంబంధించి గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 301 పరిశ్రమలలో పారిశ్రామికేతర రంగాలకు చెందిన 95 సంస్థలు మినహా మిగిలిన 206 కర్మాగారాలలో భద్రతకు సంబంధించి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే 186 పరిశ్రమలలో చేపట్టవలసిన అంశాలను తెలియజేశామని అధికారులు తెలిపారు. భద్రత రక్షణ చర్యలపై ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ అధికారులు వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరారు. డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. వీటన్నింటిపై తీసుకున్న చర్యలపై యాక్షన్ టేకెన్ రిపోర్టును వారం రోజుల్లో పంపించాలని జిల్లా కార్మికాధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లను ఆదేశించారు. బాయిలర్ నిర్వహణపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని బాయిలర్స్ శాఖను కోరారు. కార్మికుల భద్రత, సంక్షేమంపై యాజమాన్యం దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ల సలహాలను తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించేటప్పుడు ఏవిధంగా స్పందించాలనే విషయమై కార్మికులకు శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రియాక్టర్ల వద్ద పనిచేసేవారు సంబంధిత అంశంలో విద్యార్హత కలిగిన వారై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక అధికారి బుద్ధా మునిస్వామి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ అధికారి, జిల్లా అగ్నిమాపక అధికారి పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో గురువారం గ్రామసభ జరిగింది. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం శానిటేషన్, ఎన్ఆర్‌జిఎస్ పనితీరు, జగనన్న హౌసింగ్ పట్టాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ, పారిశుధ్యం, స్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయం కన్వీనర్ పోలిమేర గణేష్, వార్డు మెంబర్లు బొడ్డేడ అప్పలనాయుడు, కొయ్యిలాడ రామచంద్రరావు, టెక్కలి వీర కొండలరావు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామ సచివాలయం వద్ద వైయస్సార్ కంటి వెలుగులో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జె.తుని సర్పంచ్ కొన అరుణ మాట్లాడుతూ మనిషి మనుగడకు కంటి చూపు ప్రధానమని తెలిపారు. కంటి వైద్య నిపుణులు వరహాలు 42 మందికి కంటికి పరీక్షలు చేశారు. అందులో 20 మందికి కంటికి ఆపరేషన్స్ కొరకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బస్సులో తరలించారు. కార్యక్రమంలో కొన నాగేశ్వరరావు, క్యాంపు కోఆర్డినేటర్ అశ్విని కుమార్, కంటి రోగులు పాల్గొన్నారు.



కంటి ఆసుపత్రికి బయలుదేరుతున్న రోగులు

గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణ

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఆరిపాక రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 67లో వాగు పోరంబోకు భూమిని రియల్టర్లు కబ్జా చేశారు. దీనిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే వాగు లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని విస్తరించి ఉంది. లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 75లో కూడా గెడ్డ వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురైంది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. ఆరిపాక సర్వే నెంబర్ 67లో 4 ఎకరాల 75 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. అందులో సుమారు 90 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ విషయమై వీఆర్వో సునందను వివరణ కోరగా వాగు పోరంబోకు స్థలం ఆక్రమణకు గురవడం వాస్తవమేనని, ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.



గెడ్డను ఆక్రమించి చెట్లు తొలగించి చదును చేసిన దృశ్యం

అమ్మఒడి కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం విడుదల చేయాల్సిన అమ్మఒడి నగదు కోసం విద్యార్థులు తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. రోజులు గడుస్తున్న ఖాతాలో నగదు జమ కాకపోవడంతో నగదు జమ అవుతుందా అవ్వదా అంటూ ఆందోళన చెందుతున్నారు. గత నెల 28వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గత ఏడాది 5476 మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరిలో కొద్ది మందికి మాత్రమే రూ.13 వేలు చొప్పున నిధులు జమ అయ్యాయి. 100 మంది విద్యార్థుల్లో ఐదుగురు విద్యార్థులు తల్లిదండ్రులకు మాత్రమే నిధులు జమైనట్లు తెలుస్తోంది. దీంతో పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు బ్యాంకుల చుట్టూ నగదు జమ అయ్యాయా లేదా అంటూ తిరుగుతున్నారు.

పోటీ పరీక్షలతో వెలుగు చూడనున్న ప్రతిభ

ప్రజాశక్తి-కె.కోటపాడు

విద్యార్థుల ప్రతిభాపాటవాలు వెలుగు చూడాలంటే పోటీ పరీక్షల్లో పాల్గొనాలని ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అంబేద్కర్ రాజు అన్నారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ 2022-2023లో బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించిన అయ్యన్న స్కూల్ విద్యార్థులను ఆయన ప్రశంసించారు. గురువారం అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం అధ్యక్షతన పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సాహనిస్తున్న అయ్యన్న స్కూల్ యాజమాన్యాన్ని, ఉత్తమమైన బోధన చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. జాతీయస్థాయి రెండవ రౌండ్లో ప్రతిభ కనబరిచిన ఒకటి నుంచి పది తరగతులకు చెందిన 19 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. 2022-2023 విద్యా సంవత్సరంలో అయ్యన్న స్కూల్ జాతీయస్థాయిలో గోల్డెన్ స్కూల్‌గా నేషనల్ ఒలింపియాడ్ ఎంపిక చేసి అవార్డు ఇచ్చింది. ఈ అవార్డును డాక్టరు ఖాశీంకు ప్రొఫెసర్ అంబేద్కర్ రాజు అందచేశారు. బెస్ట్ ఇన్స్పైరింగ్ ప్రిన్సిపాల్‌గా హరీషా, బెస్ట్ ఇన్స్పైరింగ్ టీచర్స్‌గా కళ్యాణి, నాగశిరీషకు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ఇచ్చిన అవార్డ్సును అంబేద్కర్ రాజు అందచేశారు. నేషనల్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచిన కందివలస జనార్ధన్‌ను డాక్టరు అంబేద్కర్ రాజు, డాక్టరు ఖాశీం అభినందించారు.



పతకాలు, ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు, చిత్రంలో ఖాసీం, అంబేద్కర్‌రాజు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి

ప్రజాశక్తి- సీతమ్మధార : బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఏపిఈపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన చిత్రపటానికి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మిడి, డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, ఎవివి.సూర్యప్రతాప్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు అచ్చి రవికుమార్, వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, ఒ.సింహాద్రి, జె.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, సిజిఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : వేములవలస కూడలిలో ఎస్ఎస్ఎల్ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు అప్పలసూరి, విశాఖపట్నం జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షులు కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

మాడుగుల. మండలంలోని ఒమ్మలిలో గురువారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. సోషలిస్ట్ మహాజన సంఘం జిల్లాకార్యదర్శి ఎలు సూరి ఘాటీలు పాల్గొని బాబూజీ సేవలను కొనియాడారు.జబ్బి అప్పారావు, ఏలూసూరి అప్పారావు, ఎలక రాజేష్, ఎలక కొండమ్మ, అచ్చియ్యమ్మ, నూకాలమ్మ శాంతి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బలిఘట్టం గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడబండి నాగేశ్వరరావు, జిఎన్ఆర్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం. అప్పలరాజు దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ విగ్రహానికి తెలుగు యువత మండల అధ్యక్షులు తిరుమలరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు బోడపాలెం మాజీ సర్పంచ్ సత్యంబాబు, టిడిపి సీనియర్ నాయకులు సుంకర బాబ్జి, గంటెడ లోవరాజు, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : బాబు జగ్జీవన్ రామ్ 37వ వర్ధంతిని పురస్కరించుకొని అనకాపల్లి 80వ వార్డు అరుంధతి నగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గురువారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరే సతీష్, బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్మోహన్, మల్ల గణేష్, సాలాపు నాయుడు, కర్రి మల్లేశ్వరరావు, మళ్ల సురేంద్ర, కొణతాల జగ్గారావు నాయుడు, ధనాల విష్ణు చౌదరి, కుమార్, బుద్ద శ్రీను, బుద్ద భువనేశ్వరరావు, పెట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



కోటవురట్లలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

సబ్బవరం : మండలంలోని అమరపినివానిపాలెం, అంతకాపల్లి గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గొటివాడ స్మార్ట్ కుమార్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్రా జయరాజు దువ్వ దుర్గాలు, ఇండుగుబిల్లి గోపి, కొమ్ము కోటి, పెట్ల ఈశ్వరరావు, సూర్య ప్రకాష్, నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గుర్రం జాషువా కోలనీలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు నెల్లి గురుదేవ్ పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో చెవ్వేటి నాగ రాజు, కొల్లి రాంజీ, ఒరేల అప్పారావు, కొల్లి దేముళ్ళ పాల్గొన్నారు.

చోడవరం : పట్టణంలోని ఇందిరా కాలనీలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు యలకా మల్లిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్తా శ్రీనివాసరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎలకా గణేష్, కంటిపాము అప్పల నరస, ఎలక దేవుడమ్మ, కండెల్లి మహాలక్ష్మి, ఇంద్రిరా కాలనీ యూత్ పాల్గొన్నారు.

కలప దుంగల పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోనే జోగుంపేట జంక్షన్‌లో గురువారం తెల్లవారుజామున టాటా ఏసి వ్యాన్‌లో జీడిపిక్కల మాటున తరలిస్తున్న 11 కలప దుంగలను ఉత్తరాంధ్ర స్వాడ్ డిఎఫ్ఒ సోమసుందర్ ఆధ్వర్యంలో అటవీ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడిన కలప వాహనాన్ని గొలుగొండ అటవీ కలప డిపోకు తరలించారు. అయితే పట్టుబడిన టాటా ఏసి వాహనంలో 21 బస్తాలు జీడిపిక్కల అడుగున గన్నర దుంగలు గుర్తించినట్లు అటవీ అధికారులు తెలిపారు. పట్టుబడిన గన్నర దుంగలు తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల మండలం భీమదోలు నుంచి నాతవరం మండలం ములగపూడి బెన్నవరం గ్రామానికి చెందిన రమణ ఇంటి తరలిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తి సమాచారంతో స్వాడ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని అంచనా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు.

పట్టుబడిన రేషన్ బియ్యం వేలం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పట్టుబడ్డ పిడిఎస్ బియ్యానికి రెవెన్యూ అధికారులు గురువారం వేలంపాట నిర్వహించారు. 144.22 క్వింటాళ్ల బియ్యానికి వేలంపాట నిర్వహించగా, అత్యధికంగా కిలో రూ.30 చొప్పున వేలంపాటలో ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ తాహసిల్దార్ సోమశేఖర్, గోదాము అధికారులు తెలిపారు. వేలంలో అధిక ధర పలికిందని అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఛార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇందిరా భారతి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఇన్‌ఛార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇందిరాభారతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు ఇటీవల బదిలీల్లో నర్సీపట్నంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన యుగంధర్‌రావు శ్రీకాకుళం జిల్లా టెక్కలి బదిలీ చేశారు.ఆ స్థానంలో వేరొకరిని నియమించకపోవడంతో అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరా భారతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇదిలాఉండగా నర్సీపట్నం కేంద్రంగా 2014లో ప్రభుత్వం తొలిసారిగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరు చేసిన సమయంలో, ఇందిరాభారతి తొలి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌గా అప్పట్లో బాధ్యతలు చేపట్టి మూడేళ్ల పాటు 2017 వరకు పనిచేశారు. సమర్థవంతురాలైన అధికారిగా విజయవంతంగా పనిచేశారు

ఫణి శాంతారామ్‌కు పరామర్శ

ప్రజాశక్తి-గొలుగొండ : గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కొరుప్రోలు ఫణి శాంతారాంను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ గురువారం పరామర్శించారు. ఇటీవలే కాలికి గాయంతో చికిత్స అనంతరం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న శాంతారాంను పరామర్శించారు. జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, నర్సీపట్నం వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, నర్సీపట్నం మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, నాయకులు జాగు రామకృష్ణ, చీడిగుమ్మల పిఎసిఎస్ అధ్యక్షులు ఇటంశెట్టి రామకృష్ణ, గుండుపాల ఎంపిటిసి కొరుప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రోలుగుంట మండల సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట : ఈ నెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రభాకరరావు తెలిపారు. ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులైన ఎంపిటిసిలతోపాటు గౌరవసభ్యులు సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా రావాలని సూచించారు.

లాలం భాస్కరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి- మాడుగుల: టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని భర్త, సీనియర్ నేత లాలం భాస్కరరావు అకాల మరణంపై మాడుగుల టిడిపి నేతలు గురువారం సంతాపం వ్యక్తం చేశారు.పార్టీ కార్యాలయంలో సంతాప సమావేశం నిర్వహించి నివాళులు అర్పించారు. భాస్కరరావు మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో లెక్కల కాశీబాబు, రంజిత్ వర్మ,ఎం ఎం దాసు, వేగి రాంబాబు, మరువాడ ఈశ్వరరావు, సూర్యనారాయణ వర్మ, డిల్లీ నానాజీ, ఆడిటర్ మూర్తి పాల్గొన్నారు

ఘనంగా సత్తమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం సత్తమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. చింతలపాటి కుటుంబీకులు ఆధ్వర్యంలో ఏటా ఆషాడ మాసంలో అమ్మవారి పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ,మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం సిఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారనిఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షం పడుతున్నా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలఅమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 12వ వార్డులో సుమారు రూ.1.50 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కమిషనర్ కనకారావు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, కోఆప్షన్ మెంబర్ షేక్ రోజా, కౌన్సిలర్ భేతిరెడ్డి రత్నం పాల్గొన్నారు.

కొత్తకోట హెచ్ఎంగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలంలో కొత్తకోట పిఎస్ఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా కె. నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నవర బ్రహ్మాజీ, రావికమతం మండల ఎంఇఒ-2గా ప్రమోషన్‌పై వెళ్లారు.

ఎ.ఎల్.పురం హెచ్ఎంగా నాగభూషణం

ప్రజాశక్తి-గొలుగొండ : ఏఎల్‌పురం హైస్కూల్ హెచ్ఎంగా వనపల్లి నాగభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత హెచ్ఎం సూర్యనారాయణ రాంబిల్లి మండలం ఎంఇఒగా ఉద్యోగోన్నతిపై బదిలీ కాగా, ఆ స్థానంలో జోగుంపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు నాగభూషణంను నియమించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఇంజనీరు మహేష్ తెలిపారు. బొడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్తు లైను మరమత్తు పనులు నిర్వహిస్తున్న కారణంగా, ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'జగనన్న చేదోడు' వర్తింపజేయాలని వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో చేతివృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న చేదోడు పథకాన్ని తమకూ వర్తింపజేయాలని, డివిజన్ మక్కా మదీనా కత్తెర సాన యూనియన్ సభ్యులు కోరారు. గురువారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఇది రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని, ఈ విషయాన్ని తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు షేక్ బడే సాహెబ్ మాట్లాడుతూ, తాము పూర్వం నుండి చేతి వృత్తులపైన ఆధారపడి జీవిస్తున్నామని, కత్తెర్లు సాన పట్టడం, రేకు పనిముట్లు తయారు చేయడం వంటి పనులు చేసుకుంటూ, వచ్చే అరకొర ఆదాయంతోనే జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేతివృత్తుల వారికి ఏదో రూపేణా ఆర్థిక సహాయం అందిస్తుందని, తమ వృత్తిని ప్రభుత్వం ఇప్పటికీ పరిగణన లోనికి తీసుకోలేదన్నారు . ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి, జగనన్న చేదోడు పథకాన్ని వర్తింపచేయాలని కోరారు.కార్యక్రమంలో డివిజన్ యూనియన్ సభ్యులు షేక్ మస్తాన్, షేక్ పకీర్ సాహెబ్, షేక్ ఇమామ్ సాహెబ్, షేక్ రెహమాన్, షేక్ లాలూ పాల్గొన్నారు.




ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

సరిపడా విత్తనాల పంపిణీలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పూర్తి స్థాయిలో వరి విత్తనాలు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో రైతులకు విత్తనాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఏడాదికి ఎంత విత్తనాలు అవసరం అవుతుందో ముందస్తు ఇండెంట్ పెట్టి తెప్పించడంలో అధికారుల వైఫల్యంపై ఆక్షేపించారు. రైతుల దగ్గర డబ్బులు తీసుకుని 20రోజులైనా ఇవ్వకపోవడం ప్రభుత్వం, అధికారుల చేతకానితనమేనన్నారు. తక్షణం స్పందించకుంటే కలెక్టరేట్ వద్ద ఆందోళనచేస్తామని హెచ్చరించారు. టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, మొండం శివ, డాక్టర్ నారాయణరావు, విసం వెంకటేష్, బోడెపు తాతబాబు, మాకిరెడ్డి వెంకటరమణ, కర్రి సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ సమస్యపై జగన్‌కు వినతి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం రోడ్డు విస్తరణ సమస్యను స్థానిక వర్తక వ్యాపార యజమానులు నిర్వాసితులంతా సిఎం జగన్మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు రూ.300 కోట్ల ఆస్తిని తామంతా కోల్పోతున్నామని ముఖ్యమంత్రికి గోడు వెల్లబోసుకున్నారు. రోడ్డు విస్తరణ పరిధిని 100 అడుగులుకాకుండా, 80 అడుగులు తగ్గించడం ద్వారా నష్టశాతాన్ని తగ్గించి తమను ఆదుకోవాలని విన్నవించారు. దీనిపై పలుమార్లు ఎమ్మెల్యే, ఇతర అధికారులకు విన్నవించామన్నారు. తమకు తగు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వద్ద వ్యాపారస్తులు షాపు యజమానులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం షాపు యజమానులు మీడియాతో మాట్లాడుతూ తమకు జరుగుతున్న అన్యాయాన్ని పోతల ప్రసాద్ ద్వారా విజయసాయిరెడ్డికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



సిఎం జగన్‌కు విన్నవిస్తున్న నిర్వాసితులు (ఫైల్)

10, 11 తేదీల్లో అంగన్వాడీల ఆందోళన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఈనెల 10 ,11 తేదీల్లో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.ఐదు లక్షలు చెల్లింపుతోపాటు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాల ,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల ఆందోళనలో అంగన్వాడీలు,హెల్పర్లు ,మినీ వర్కర్లు పాల్గొనాలని కోరారు సిఐటియు నాయకులు ఎం అప్పలరాజు, ప్రాజెక్ట్ అధ్యక్షులు సుబ్బలక్ష్మి, కార్యదర్శి నూకరత్నం, నాగఫణి, కవిత, రమణమ్మ, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి-గొలుగొండ : ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు నర్సీపట్నం ఎఎస్‌పి ఆదిరాజ్‌సింగ్ రాణా అన్నారు. గురువారం కృష్ణదేవిపేట సమీపంలోని భీమవరం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు సిఐ, ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. పాతకేడీపేట మీదుగా జరుగుతున్న రోడ్డు పరిశీలించి గంజాయి రవాణా నిర్మూలనకు ఏయే మార్గంలో తనిఖీ చేపట్టాలో సిబ్బందికి సూచించారు. నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, కేడిపేట ఎస్ఐ ఉపేంద్ర, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -నక్కపల్లి : జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ జయరాం ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఒ సీతారామరాజు, హౌసింగ్ ఎఇ రాజు, డిటి నీరజతో సమీక్ష నిర్వహించారు.జగనన్న లేఅవుట్‌లలో గృహ నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు .

రహదారి, పాఠశాలకు పోరాటం ఉధృతం

సిపిఎం ఆధ్వర్యాన నేటి నుంచి వినూత్న నిరసనలకు అణుకు గిరిజనం సన్నద్ధం



రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ధర్నా శిబిరం



... మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి - కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసనకు గిరిజనం సిద్ధమౌతున్నారు.. తమ గ్రామ సమస్యలపై అధికారులు, నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ధర్నాలు, ఆందోళనలో రూపంలో అనేకసార్లు పోరాటాలు, నిరసన చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో శాశ్వత ఆందోళనకు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు గురువారం రోడ్డుకు అడ్డంగా కొబ్బరి కమ్మలతో పందిరి వేసి ధర్నా శిబిరాన్ని ఏర్పాటు చేసారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే వరకు శుక్రవారం నుంచి ఇదే శిబిరంలో నిరసన ధర్నాను కొనసాగిస్తామని అంటున్నారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు మాట్లాడతూ అణుకు గిరిజన గ్రామంలో 40 కుటుంబాలకు చెందిన 160 మంది జనాభా ఉన్నారని, వీరు ప్రతిచిన్న అవసరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొట్టువాడ పంచాయతీ కేంద్రానికి వెళ్లాల్సిందేనన్నారు. ఇంటికి నిత్యవసరమైనా, అత్యవసర వైద్యమైనా, పిల్లల చదువులైనా, ఇంకే అవసరమైనా గొట్టువాడ వెళ్లాల్సిన స్థితిలో సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీనిపై గిరిజనులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేని పరిస్థితుల్లో అణుకు గ్రామానికి వెళ్లే రహదారికి అడ్డంగా శిబిరాన్ని ఏర్పాటు చేశామని, శుక్రవారం నుంచి రిలేదీక్షలను చేపట్టి, అప్పటికీ ప్రభుత్వం, అధికారుల నుంచి స్పందన లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అణుకు గిరిజన గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిల పాఠశాల భవనం పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



శిథిల పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ, ఎఇ

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో మైదాన ప్రాంత గిరిజన గ్రామం ఎంకె.పట్నం శివారు గ్రామం పెదపేట గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎంఇఒ పి.జోగారావు, ఇంజనీరింగ్ అధికారి గ్రేడ్-2 ఎఇ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ నెల 6న 'శిథిల భవనంలో చదువులు' శిర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ భవనం పునర్నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తానన్నారు. ఎంకె.పట్నం గ్రామ కార్యదర్శి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

డుమ్మా కొట్టిన మెజార్టీ ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపిపి గజ్జలపు మణికుమారి

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. గురువారర ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సమస్యలు లేవనెత్తే ప్రజా ప్రతినిధులు కరువయ్యారు. ఆరుగురు ఎంపిటిసిలు, మరో ఆరుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. అనంతరం ఎజెండా ప్రకారం శాఖలవారీగా ఆయా అధికారులు నివేదికలను వినిపించారు. వరివిత్తనాల సరఫరాలో నెలకొన్న ఇబ్బందులపై ఎఒ సుధారాణి వివరణనిస్తూ, మొదటి విడతలో పెట్టిన ఇండెంట్ ప్రకారం విత్తనాలు రాకపోవడంతో వాటిని రద్దు చేసి, మళ్లీ ఇండెంట్ పెట్టామని, రెండు మూడురోజుల్లో ఆర్‌బికెలకు విత్తనాలు చేరుకుంటాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ డిఇ ఈశ్వరరావు, జెడ్‌పిటిసిగిరిబాబు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, పరిపాలనాధికారి సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు

ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డు భూముల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు కాగిత నుండి పాటిమీద వరకు రోడ్డు నిర్మాణానికి గతంలో ఎపిఐఐసి అధికారులు గుర్తించిన భూములను గురువారం జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పరిశీలించారు. మ్యాప్‌ను పరిశీలించి, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు.



మ్యాప్ సాయంతో పరిశీలిస్తున్న జెసి జాహ్నవి

రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు జరిగిన ప్రక్రియ, భూ సేకరణ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుండి సేకరించిన భూములు, వాటి పరిహారానికి సంబంధించి రైతులతో జరిగిన చర్చలు వివరాలను ఎపిఐఐసి అధికారులు జెసికి విన్నవించారు.ఈ సందర్భంగా మరింత దగ్గర మార్గంలో రోడ్డు ఏర్పాటుకు అవకాశం ఉంటే పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. మూలపర్ర తదితర ప్రాంతాల్లో సేకరించిన భూములను జెసి పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రెడ్డి, ఆర్‌డిఒ జయరాం, తహసీల్దార్ అంబేద్కర్, ఎస్‌డిసి అనిత, ఎపిఐఐసి జెడ్ఎం త్రినాథరావు పాల్గొన్నారు .

సంక్షోభంలో ఆయిల్ పామ్ సాగు

గణనీయంగా పెరిగిన పెట్టుబడులు ధర పతనంలో రైతుల దిగాలు

ప్రజాశక్తి- మాడుగుల : ఆయిల్ పామ్ రైతులు దివాళా దిశగా పయనిస్తున్నారు. కొద్దికాలం నుండి ధరలు ఆమాంతంగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొద్ది నెలల కిందట టన్ను గెలల ధర రూ.22 వేల పలకగా, కొద్ది రోజులు కిందట రూ.16,900 కి ధర దిగింది. ప్రస్తుతం ఏకంగా రూ.13 వేలకు పడిపోవడంతో సాగు ఖర్చులకు, వచ్చే ఆదాయానికి పొంతన లేక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతోపాటు రూ.850 రూపాయలు ఉండే పొటాష్ బస్తా ప్రస్తుతం రూ.1720 కి పెరిగింది ఇదేవిధంగా బోరాన్, మెగ్నీషియం వంటి ధరలు పెరగగా, సూపర్ ఫాస్ఫేట్‌పై బస్తాకు రూ. రెండు వందలు పెరిగింది. దిగుబడి పెంచేందుకు భూసారానికి పశువుల గెత్తం వేయవలసి ఉంటుంది గతంలో వెయ్యి రూపాయలు ఉండే గెత్తం ట్రక్కులోడు ప్రస్తుతం రూ.1700 పెరిగింది. మొత్తంగా పెరిగిన ఎరువులు, ఇతరత్రా ఖర్చులతో ఎకరా ఆయిల్‌పామ్ సాగుకు రూ.56 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. బాగా పండితే, . ఒక ఎకరానికి ఐదు టన్నుల దిగుబడి వస్తుందని, తొలకరి



ఆయిల్‌పామ్ పండ్లు

గాలుల ప్రభావంతో ఈ ప్రాంతంలో ఇంతకంటే ఎక్కువ దిగుబడి రాదని రైతులు అంటున్నారు. ప్రస్తుతమున్న టన్ను ఆయిల్ పామ్ పండ్ల ధర రూ.13వేలతో లెక్కిస్తే రైతులకు శ్రమ తప్ప, ఇంకేమీ మిగిలే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు భూములు లీజుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రం నష్టాలు తప్పే పరిస్థితి లేదు. ఎకరానికి రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు లీజు చెల్లించి, ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల కౌలు రైతులకు తీవ్రనష్టాలు తప్పని పరిస్థితి.

ఒకవైపు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరగడం, మరోవైపు నామమాత్రపు దిగుబడులు, గిట్టుబాటుకాని ధరలతో ప్రస్తుతం పామ్ ఆయిల్ వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడినట్టేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు 90శాతం, ఇతరులకు 50శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలను కల్పించి, సాగును ప్రోత్సాహించింది. కానీ ప్రస్తుతంఅటువంటి ప్రోత్సాహకాలు, పథకాలేవీ లేకపోవడంతో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. పోనీ ఎవరైనా రైతు సాగుకు ఉపక్రమిస్తే రూ.300 ధర పలుకుతున్నా, ఆయిల్‌పామ్‌మొక్కలు అనుకున్న సమయానికి సరఫరా చేసే పరిస్థితి లేదని అంటున్నారు. పొలంలో చనిపోయిన మొక్కలు స్థానే వేరే మొక్కలునాటాలన్నా, కొత్తగా సాగు మొదలు పెట్టాలన్నా సకాలంలో మొక్కలు సరఫరా కాని పరిస్థితి ఉదంని రైతులు అంటున్నారు. అన్ని విధాలా ప్రతికూల పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు ముమ్మందు కష్టమేనని రైతులు స్పష్టం చేస్తున్నారు.